# జొకోకు షాక్

**సిన్నెర్ చేతిలో పరాజయం • ఆస్ట్రేలియా ఓపెన్**



**పెట్టనికోట లాంటి ఆస్ట్రేలియా ఓపెన్‌లో ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్‌కు చుక్కెదురైంది. గతంలో క్వార్టర్ ఫైనల్ దాటిన పదిసార్లు.. తిరుగులేని ప్రదర్శనతో ఈ టైటిల్ గెలిచిన సెర్బియా వీరుడు ఈ సారి సెమీస్‌లో నాలుగో సీడ్ సిన్నెర్ చేతిలో పరాజయం పాలయ్యాడు.**



సిన్నెర్

మెల్‌బోర్న్: సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్‌లో అతిపెద్ద సంచలనం నమోదైంది. పురుషుల సింగిల్స్‌లో అందరికంటే ఎక్కువ (24) టైటిల్స్ గెలిచిన ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్‌కు సెమీఫైనల్లో షాక్ తగిలింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో టాప్ సీడ్ జొకోవిచ్ 1-6, 2-6, 7-6 (8/6), 3-6తో నాలుగో సీడ్ సిన్నెర్ చేతిలో ఓడాడు. గతంలో పది సార్లు ఆస్ట్రేలియా ఓపెన్ సెమీస్ ఆడి.. అన్నింట్లోనూ టైటిల్ గెలిచిన జొకో.. ఈ మ్యాచ్‌లో అదే స్థాయి ప్రదర్శన కనబర్చలేకపోయాడు. మూడున్నర గంటల పాటు సాగిన పోరులో 54 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. మరో సెమీస్‌లో మెద్వెదెవ్ 5-7, 3-6, 7-6 (7/4), 7-6 (7/5), 6-3తో జ్వెరెవ్‌పై గెలిచాడు. శనివారం మహిళల సింగిల్స్ ఫైనల్లో జెంగ్‌తో సబలెంక తలపడనుండగా.. ఆదివారం మెద్వెదెవ్, సిన్నెర మధ్య తుదిపోరు జరగనుంది.

# తన్మయ్ తాండవం

**బౌలర్ చేతి నుంచి బంతి పడిందే ఆలస్యం.. దానిపై ఆకలిగొన్న సింహంలా విరుచుకుపడిన హైదరాబాద్ ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ రికార్డుల దుమ్ముదులిపాడు. క్రీజులో అడుగు పెట్టగానే వీరేంద్ర సెహ్వాగ్ పూనినట్లు.. ప్రత్యర్థి బౌలర్లను చీల్చి చెండాడుతూ.. అజేయ ట్రిపుల్ సెంచరీ బాదాడు. ఈ క్రమంలో తన్మయ్ వరల్డ్ రికార్డు బద్దలు కొట్టగా.. అరుణాచల్‌తో రంజీ పోరులో హైదరాబాద్ కొండంత స్కోరు చేసింది!**

**ఒక్క రోజులోనే ట్రిపుల్ సెంచరీ**

- 160 బంతుల్లో 323 నాటౌట్
- ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో నయా రికార్డు
- హైదరాబాద్ 529/1
- అరుణాచల్‌తో రంజీ మ్యాచ్



తన్మయ్

**160 బంతుల్లో 323***

**33 ఫోర్లు | 21 సిక్సర్లు**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: యువ ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (160 బంతుల్లో 323 బ్యాటింగ్; 33 ఫోర్లు, 21 సిక్సర్లు) రికార్డు ట్రిపుల్ సెంచరీతో చెలరేగాడు. ఫలితంగా అరుణాచల్ ప్రదేశ్‌తో శుక్రవారం ప్రారంభమైన రంజీట్రోఫీ ప్లేట్ గ్రూప్ మ్యాచ్‌లో హైదరాబాద్ కొండంత స్కోరు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్ ప్రదేశ్ 172 పరుగులకు ఆలౌటైంది. మన బౌలర్లలో చామా మిలింద్, కార్తికేయ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 529 పరుగులు చేసింది. తన్మయ్ ట్రిపుల్ సెంచరీతో చెలరేగితే.. కెప్టెన్ రాహుల్ సింగ్ (105 బంతుల్లో 185; 26 ఫోర్లు, 3 సిక్సర్లు) తృటిలో డబుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. అరుణాచల్ బౌలర్ల అనుభవ రాహిత్యాన్ని సొమ్ము చేసుకున్న హైదరాబాద్.. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో పలు రికార్డులు తిరగ రాసింది. ప్లేట్ గ్రూప్‌లో ఆడిన గత మూడు మ్యాచ్‌ల్లోనూ ఇన్నింగ్స్ విజయాలతో హ్యాట్రిక్ నమోదు చేసుకున్న హైదరాబాద్ ఇప్పుడు మరో విజయానికి రాచబాట సిద్ధం చేసింది.


### ఈ మ్యాచ్‌లో నమోదైన రికార్డులు

- ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో తన్మయ్‌దే ఫాస్టెస్ట్ (147 బంతుల్లో) ట్రిపుల్ సెంచరీ.
- 119 బంతుల్లో డబుల్ సెంచరీ చేసిన తన్మయ్ భారత్ తరపున ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో వేగవంతమైన ద్విశతకం చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. రవిశాస్త్రి (123 బంతుల్లో) రెండో స్థానంలో ఉన్నాడు.
- భారత్ నుంచి ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఒకే రోజులో 300 పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా తన్మయ్ రికార్డుల్లోకెక్కాడు. సెహ్వాగ్ లంకపై టెస్టులో ఒకే రోజులో 284 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు.

# ఉప్పొంగిన ఉప్పల్

**భారత్ తొలి ఇన్నింగ్స్ 421/7 • రాహుల్, జడేజా హాఫ్‌సెంచరీలు**

**175 పరుగుల ఆధిక్యం • ఇంగ్లండ్‌తో తొలి టెస్టు**



రాహుల్ (86)





జడేజా (81*)

**ఊహించిందే జరిగింది! తొలి రోజు ఇంగ్లండ్ బ్యాటర్లు తడబడ్డ చోట మన వాళ్లు దుమ్మురేపారు. ఉప్పల్ పిచ్‌పై బంతిని ఎదుర్కొనేందుకు ఇంగ్లండ్ ప్లేయర్లు ఆపసోపాలు పడితే.. రోహిత్ గ్యాంగ్ ఒకరి తర్వాత ఒకరు వంతులు వేసుకొని బాదుడు కొనసాగించింది!**

**యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ శతక్కొట్టే అవకాశం చేజార్చుకోగా.. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా మూడంకెల స్కోరుకు సమీపించాడు. ఇప్పటికే 175 పరుగుల ఆధిక్యం దక్కించుకున్న టీమ్ఇండియా.. శనివారం ఉదయం మరెన్ని పరుగులు జోడిస్తుందో చూడాలి! ఇదే జోరు సాగితే.. ఇక రెండోసారి రోహిత్ సేన బ్యాటింగ్ చేయాల్సి రాకపోవచ్చు!**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బంతితో ఇంగ్లండ్ కట్టిపడేసిన టీమ్ఇండియా.. బ్యాట్‌తో దుమ్మురేపింది. ప్రత్యర్థి ప్లేయర్లు క్రీజులో నిలబడేందుకే ఇబ్బంది పడ్డ ఉప్పల్ పిచ్‌పై భారత ఆటగాళ్లు యథేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. ఫలితంగా ఇంగ్లండ్‌తో తొలి టెస్టుపై రెండో రోజే రోహిత్ సేన పట్టు బిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 119/1తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన టీమ్ఇండియా.. ఆట ముగిసే సమయానికి 7 వికెట్లు కోల్పోయి 421 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (86; 8 ఫోర్లు, 2 సిక్సర్లు), రవీంద్ర జడేజా (81 బ్యాటింగ్; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), యశస్వి జైస్వాల్ (80; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) హాఫ్‌సెంచరీలతో చెలరేగారు. శ్రేయస్ అయ్యర్ (35), శుభ్‌మన్ గిల్ (23) మంచి ఆరంభాలు లభించాక.. భారీ షాట్‌లకు యత్నించి ఔట్ కాగా.. తెలుగు ఆటగాడు శ్రీకర్ భరత్ (41) సత్తాచాటాడు. అశ్విన్ దురదృష్టవశాత్తు రనౌట్ కాగా.. చివర్లో అక్షర్ పటేల్ (35 బ్యాటింగ్, 5 ఫోర్లు, 1 సిక్సర్) తన విలువ చాటుకున్నాడు. ఇంగ్లండ్ బౌలర్లలో రూట్, హార్ట్లీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. చేతిలో మరో మూడు వికెట్లు ఉన్న టీమ్ఇండియా.. ప్రస్తుతం 175 పరుగుల ఆధిక్యంలో ఉంది. జడ్డూ, అక్షర్ జోడీ.. మూడో రోజు మరెన్ని పరుగులు జోడిస్తుందనేదానిపై భారత్ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తుందా లేదా అనేది ఆధారపడి ఉంది.

**స్కోరు బోర్డు**

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 246; భారత్ తొలి ఇన్నింగ్స్: 421/7 (రాహుల్ 86, జడేజా 81 నాటౌట్; రూట్ 2/77, హార్ట్లీ 2/131).

### ప్రేక్షకులు వెల్లువలా..

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియానికి ప్రేక్షకులు పోటెత్తారు. శుక్రవారం రిపబ్లిక్ డే సందర్భంగా అటు స్కూల్ పిల్లలకు తోడు ఆర్మీ జవాన్ల కుటుంబాలకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఉచిత ప్రవేశం కల్పించింది. దీంతో ఈ మధ్య కాలంలో ఎన్నడూలేని విధంగా టెస్టు మ్యాచ్ చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి కనబరిచారు. రెండో రోజు ఆటకు 30,886 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు స్టేడియం మొత్తం కలియతిరిగారు. అంతకుముందు ఉదయం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయజెండాను జగన్ ఎగరవేశారు.

### జడ్డూపై అశ్విన్ ఆగ్రహం

రవిచంద్రన్ అశ్విన్‌కు కోపమొచ్చింది. కేఎస్ భరత్ ఔట్ తర్వాత క్రీజులోకొచ్చిన అశ్విన్ అనుకోకుండా రనౌట్ అయ్యాడు. కవర్స్‌లో షాట్ ఆడిన అశ్విన్.. పరుగు కోసం ప్రయత్నించగా, జడేజా సరిగ్గా స్పందించకపోవడంతో ఒక పరుగుకే రనౌట్‌గా వెనుదిరిగాల్సి వచ్చింది. జడేజా పరుగు తీసినట్టే తీసి తిరిగి క్రీజులోకి రావడం అశ్విన్ ఔట్ కావడం వెంటవెంటనే జరిగిపోయాయి. దీంతో సింగిల్ డిజిట్‌కే ఔటైన అశ్విన్.. జడేజాపై కోపాన్ని ప్రదర్శించాడు.

**తల్వార్ సంబురం..**

టీమ్ఇండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా స్టయిలే వేరు. ఇంగ్లండ్‌తో హైదరాబాద్‌లో జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు ఆటలో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న జడేజా.. తనదైన శైలిలో సంబురాలు చేసుకున్నాడు. అర్ధసెంచరీ మార్క్ అందుకోగానే బ్యాట్‌ను తల్వార్‌లా తిప్పుతూ తన రాజసాన్ని ప్రదర్శించాడు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.